


# ప్రవక్త చెప్పిన కథ

ఈ కతను మా ప్రవక్త చెప్పేవారంట.

ముగ్గురు స్నేహితులు ఒకరోజు అడవికి వెళ్లి అట్ల తిరుగుతూ యిట్ల తిరుగుతూ ఒక గుహలోకి వెళ్లారు. వెళ్లగానే ఒక బండరాయి దొర్లి దారి మూసుకొనిపోయింది. ముగ్గురూ ఎంతెంత ప్రయత్నించినా రాయి తొలగలేదు. ఏం చెయ్యాలా అని కూలబడ్డారు.


ఒకడన్నాడు. మనం దేవుని విశ్వాసులం. మనం ఎట్టెట్ట జీవిస్తున్నామో దేవుడికి మొరపెట్టుకుందాం. మన జీవనం సత్యమైతే ఈ రాయి తొలుగుతుంది. లేకుంటే తొలగదు అన్నాడు.

సరే అన్నారు ముగ్గురు.

మొదటివాడు యిలా చెప్పాడు: దేవుడా. నేను మేకల్ని కాస్తాను. రోజూ సాయంత్రానికి మేకల్ని యింటికి తోలుకుపోతాను. పోయాక పాలు పిండుతాను. మొదట నా తల్లిదండ్రులకి యిస్తాను. తర్వాత నా పిల్లలకు యిస్తాను. ఆ తర్వాత నా భార్యకు యిస్తాను. ఆఖర్న నేను తాగుతాను. ఒకరోజు నేను యింటికి చేరి పాలు పితికే సరికి ఆలస్యమైపోయింది. అప్పటికే నా తల్లిదండ్రులు నిద్రపోయారు. వాళ్లు ముసలివాళ్లు. వాళ్ల బిడ్డగా అందరికంటే మొదట వాళ్ల బాగోగులు చూడాల్సిన బాధ్యత నామీద వుంది. అందుకని ముంతలోనే పాలు పట్టుకొని వాళ్ల తలదగ్గర నిలుచున్నాను. నా బిడ్డలు ఆకలితో వున్నారు. ఏడుస్తున్నారు. నా భార్యా నేనూ కూడా ఆకలితోనే వున్నాము. కానీ మొదట నా తల్లిదండ్రుల కడుపు నిండనిదే మేము కడుపు నింపుకోవడానికి లేదు అనుకొని అలాగే నిలబడ్డాను. వాళ్లు తెల్లారి లేచాక వాళ్లకు పాలు యిచ్చి, ఆ తర్వాత నా బిడ్డలకు యిచ్చి, అప్పుడు నా భార్యకు యిచ్చి, చివరకు నేను తాగాను. ఈ పని నీకు సమ్మతమైతే రాయి తొలగాలి అన్నాడు.

రాయి కొంచెం తొలగింది.

రెండవ వాడు యిలా చెప్పాడు: దేవుడా. నా దగ్గర డబ్బుంది. ఆ డబ్బు మదం చూసుకొని ఒక ఆడపిల్ల మీద కన్నేశాను. కోరినంత డబ్బిస్తాను, నాకు లొంగిపో అని చెప్పాను. ఆత్మాభిమానం గల ఆ అమ్మాయి నాకు లొంగలేదు. కొంతకాలానికి కరువొచ్చింది. తినడానికి ఎండు కర్జూరాలు కూడా దొరకని కాలం. అప్పుడు నేను నూట యిరవై రూపాయలు ఆశ చూపి మళ్లీ ఆ అమ్మాయిని లొంగిపొమ్మని చెప్పాను. ఆ అమ్మాయి నా కళ్ళల్లోకి దయగా చూసి లొంగిపోవడానికి సిద్ధమయ్యింది. ఆ దయకు నేను చలించిపోయాను. ఆమె కాళ్లమీద పడి క్షమాపణ కోరాను. ఆమె అవసరానికి తగినంత డబ్బు యిచ్చి పంపించేశాను. మళ్లీ ఏ పరాయి ఆడపిల్లవైపు కన్నెత్తి చూడలేదు. నేను చేసిన ఈ పని నీకు సమ్మతమైతే రాయి తొలగాలి అన్నాడు.



రాయి మరికాస్త తొలగింది.

మూడవవాడు యిలా చెప్పాడు: దేవుడా. నా దగ్గర చాలామంది పాలేర్లు పనిచేసేవారు. వాళ్లకు ఏరోజు కూలి ఆరోజు యిచ్చేసేవాణ్ణి. ఒకరోజు ఒక పాలేరు నా దగ్గర కూలి చేసి డబ్బులు తీసుకోకుండా వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగి రాలేదు. నేను ఆ కూలి డబ్బులతో ఒక కోడిని కొన్నాను. అది పెట్టే గుడ్లను పొదిగించాను. వాటిని పెంచి పెద్దచేసి వాటి మీద వచ్చే ఆదాయంతో ఒక గేదె కొన్నాను. ఆ గేదె మీద వచ్చే ఆదాయంతో మరికొన్ని గేదెలను కొని అలా వీలైనంత ఆస్తిని సంపాదించాను. చాలా ఏళ్ల తర్వాత ఆ పాలేరు తిరిగి వచ్చాడు. ఆరోజు మర్చిపోయి వెళ్లిన కూలిడబ్బులు అడిగాడు. యిదిగో ఈ ఆస్తంతా నీ కూలి డబ్బే తీసుకెళ్లు అన్నాను. పాలేరు ఆశ్చర్యపోయాడు. వాడి సొమ్ముతో సంపాదించింది వాడిది కాక మరెవరిదవుతుందని బలవంతంగా యిచ్చి పంపాను. ఈ పని నీకు సమ్మతమైతే రాయి తొలగాలి అన్నాడు.

అప్పుడు ఆ రాయి పూర్తిగా తొలగి వాళ్లు బయటపడ్డారు.